


శరవేగంగా కడ్తాల ప్రాంత అభివృద్ధి

ఆమనగల్లు, ఆగస్టు 18 :ఫ్యూచర్ సిటీ ఏర్పాటు నేపథ్యంలో కడ్తాల ప్రాంతం శరవేగంగా అభివృద్ధి సాధిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండలంలో పర్యటించి రూ.2లక్షల రుణమాఫీపై పార్టీ శ్రేణులంతో సమావేశమయ్యారు. కడ్తాలకు చెందిన తిరునగరి పవన్, వేణుగోపాల్‌లు ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి స్కీంను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు. రుణమాఫీ విషయంలో అపోహలు, అనుమానాలకు తావులేదన్నారు. అర్హులందరికీ త్వరలోనే వర్తింపజేస్తామని తెలిపారు.

'రాఖీ' సందడి



ఆమనగల్లులో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఓ రాఖీ దుకాణం

అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ల అన్యోన్యతకు చిహ్నం ఈ పండగ. తోబుట్టువుల మధ్య ప్రత్యేకమైన బంధానికి ప్రతీక. రాఖీ పౌర్ణమి రోజు సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి, ఆశీర్వాదం పొందుతారు. నేడు రాఖీ పండగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో రెండు మూడురోజులుగా దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. అలాగే మిఠాయి షాప్‌లు రద్దీగా దర్శనమిస్తున్నాయి. ఏ రోడ్డులో చూసినా రాఖీ దుకాణాలే దర్శనమిస్తున్నాయి. మార్కెట్లో రకరకాల రాఖీలను అందుబాటులో ఉంచారు. పిల్లల కోసం వెరైటీ రాఖీలు అనేకం కనిపిస్తున్నాయి. చోటా భీమ్, హల్క్, డోరేమాన్, సూపర్‌మాన్, షింషాన్, మోటు పత్లు తదితర కార్టూన్ పాత్రలతో కూడిన రాఖీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కాగా, మహిళలు ఆదివారం నుంచే సొంతూళ్ల బాట పట్టడంతో ఆర్టీసీ బస్సులు రద్దీగా కనిపిస్తున్నాయి. -ఆమనగల్లు, ఆగస్టు 18



మన్నెగూడ చౌరస్తాలో వెలిసిన రాఖీ దుకాణం

సీజనల్ ముప్పు!

ఇటీవల కురుస్తున్న వర్షాలతో మూగజీవాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో పశువులు వివిధ రకాల వ్యాధులతో అల్లాడుతున్నాయి. సకాలంలో వైద్యం అందక అక్కడక్కడ మృత్యువాత పడుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పశు వైద్యశాలలకు వెళ్తే అక్కడ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేక నాటు వైద్యానికే మొగ్గు చూపుతున్నారు. వారు వచ్చీరాని చికిత్స చేస్తుండటంతో వైద్యం వికటించి పశువులు అనేకం మృత్యువాత పడుతున్నాయి. ఈ పశువైద్య కేంద్రాల్లో సరైన వసతులు సైతం లేక జీవాలకు మెరుగైన వైద్యం అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా పశువులకు బొబ్బరోగం, చిటుకు వ్యాధి, పీపీఆర్, గురుక, జబ్బవాపు, గొంతు వాపు, తదితర వ్యాధులు సోకే అవకాశం ఉంది.



జిల్లాలోని పశు సంపద

పశువులు	1,88,182
గేదేలు	1,22,587
గొర్రెలు	5,78,254
మేకలు	1,88,190
కోళ్లు	1,78,09,207

వ్యాధుల బారిన పడుతున్న మూగజీవాలు

- సకాలంలో అందని పశువైద్యం
- నాటువైద్యాన్నే నమ్ముకుంటున్న రైతులు
- వికటించి మృత్యువాత పడుతున్న జీవాలు
- పశువైద్య శాలల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18)

జిల్లాలో పశుపోషణే అధిక మంది రైతుల జీవనాధారం. తరచూ వర్షాలు కురుస్తుండటంతో పశువులు వివిధ రకాల వ్యాధి బారినపడి మృత్యువాత పడుతున్నాయి. వర్షాలు, వరదలతో పరిసరాలు, వాతావరణం కలుషితమవుతున్నాయి. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాల్లో తినడానికి సరైన మేత, తాగడానికి శుభ్రమైన నీరు అందుబాటులో లేక పశువులు నానా అవస్థలు పడుతున్నాయి. దీంతో ఆ జీవాలు ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురవుతున్నాయి. ఈ సమయంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గి అంటు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉన్నదని స్థానికులు వాపోతున్నారు. వ్యాధి సోకిన పశువులు, ఆరోగ్యంగా ఉన్న పశువుల మందలో ఉన్నప్పుడు వాటికి సైతం సోకే అవకాశం ఉంటుందని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత వైద్యులు సూచిస్తున్నారు. ఈ కాలంలో సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఈ సీజనల్‌లో ప్రధానంగా సోకే వ్యాధులు

బురదపుండ్లు: పశువులు, ఇతర అనేక జీవాల్లో కనిపిస్తుంది. గిట్టలు మెత్తబడడం, గిట్టల్లో పగుళ్లు, రక్తం కారడం, కాలు కుంటడం, గిట్టలు ఊడిపోవడం వంటివి జరుగుతుంటాయి. గొర్రెలు, మేకలు జ్వరం వచ్చి చనిపోతాయి. పశువులు బురద, పేడ, మూత్రాల్లో నిల్చున్నప్పుడు బ్యాక్టీరియా గిట్టల్లోకి ప్రవేశించి వ్యాధిబారిన పడతాయి.

జలగ వ్యాధి: ఈ వ్యాధి బారిన పడిన పశువుల పేడ ద్వారా జలగల గుడ్లు నేల మీద పడతాయి. ఈ ప్రదేశాల్లో మొలచిన గడ్డిని పశువులు మేయడం ద్వారా ఈ వ్యాధి సోకి ఆకలి మందగిస్తుంది. **గాలికుంటు వ్యాధి:** జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి పశువులకు ఎక్కువగా సోకుతుంది. కలుషితమైన గాలి ద్వారా ఇది వ్యాపిస్తుంది. చిటుకు వ్యాధి, గొంతువాపు, గొర్రెల్లో నీలి నాలుక తదితర వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉంది.

గోపాల మిత్రలే అప్తులుగా..

కొన్నేళ్లుగా పశు సంవర్థక శాఖలో వైద్యుల కొరత వేధిస్తోంది. దీంతో నామమాత్రంగానే సేవలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మారుమూల ప్రాంత రైతులు నాటు వైద్యాన్నే ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 4 తాలుకా స్థాయి పశువైద్యశాలలు, 46 పశువైద్య కేంద్రాలు, 87 గ్రామీణ పశువైద్య కేంద్రాలున్నాయి. మొత్తం 309 మంది వైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 202 మంది మాత్రమే ఉన్నారు. 107 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు 48 ఉండాల్సి ఉండగా 45 మంది ఉన్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు 53 మందికి గాను 16 మంది ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్లు 37 మందికి గాను 34 మంది ఉన్నారు. ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాలు అధిక సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. 117 మందికి గాను 55 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 62 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో గోపాల మిత్రలే రైతులకు అప్తులుగా మారారు.



ఎవరూ పట్టించుకోవడం లేదు

వర్షాలు కురుస్తున్నాయి. తొలకరి వర్షాలకు మొలిచిన గడ్డి తినడంతో జీవాలకు మూతివాపు రోగం వచ్చింది. దీంతో గడ్డి తినలేకపోతున్నాయి. పశు వైద్యాధికారులు గొర్రెలు, మేకలకు వెంటనే మందులు వేయాలి. ఏటా వైద్యులు మందులు వేసేవారు. ఈ సారి మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

-బంగారు మల్లయ్య, తుమ్మలపల్లి, జిల్లేడు చౌదరిగూడ

సమయానికి డాక్టర్లు ఉండటం లేదు



నాకు ఐదు ఆవులు ఉన్నాయి. వాటికి సుస్తయినపుడు ఆస్పత్రికి వెళ్తే పశువైద్యాధికారులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో ప్రైవేట్ డాక్టర్లకు చూపించాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్యులు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా సకాలంలో రావడం లేదు. ఒక వేళ వచ్చినా మందులు బయటనే కొనుక్కోవాల్సి వస్తుంది.

-ఆరె రాజు, షాబాద్

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులకు ఎప్పటిప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో జీవాలకు టీకాలు వేస్తున్నాం. గొర్రెల్లో నీలినాలుక వ్యాధి సోకకుండా ముందస్తుగా 1.50 లక్షల గొర్రెలకు టీకాలు వేశాం. అలాగే పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సిన్, గురక వ్యాధి సోకిన పశువులకు టీకాలు ఇచ్చాం. ఇప్పటి వరకు జిల్లాలో 25,400 పశువులకు టీకాలు వేశాం. త్వరలో భారత్ పశుధన్ అనే కొత్త యాప్ అందుబాటులోకి రానుంది. దీని ద్వారా రైతులు వివరాలను పొందుపరుస్తాం. దీంతో పీపీఆర్ వ్యాక్సినేషన్ సులభతరం అవుతుంది.

-డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి జిల్లా పశువైద్యాధికారి



పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక

పాపన్నగౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బీసీ సంక్షేమశాఖ అధికారులు, బీసీ సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 : ఆదిభట్ల, శంషాబాద్, తుక్కుగూడ, మొయినాబాద్, శంకరపల్లి ప్రాంతాల్లో చెరువులు, కుంటలను ఆక్రమించి పెద్ద సంఖ్యలో అక్రమ కట్టడాలు వెలిశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆ అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని ఆయన 'హైడ్రా'ను కోరారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రాను సీపీఎం జిల్లా కమిటీ ఆహ్వానిస్తోందన్నారు. పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు కబ్జాలు చేసిన భూములను వారి నుంచి కాపాడాలని కోరుతున్నామని పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కొంతమంది రాజకీయ నాయకులు బెదిరింపులకు దిగడాన్ని ప్రభుత్వం ఉపేక్షించొద్దని కోరారు. జిల్లాలో కబ్జాలకు గురైన ప్రాంతాలను, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల వివరాలను హైడ్రాకు ఇవ్వాలని ఆయన కోరారు. ఇప్పటికే సీపీఎం తరఫున కొన్ని వివరాలను హైడ్రాకు సమర్పించడం జరిగిందని, వాటిపై విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



కప్పకావిడి ఆడుతున్న మహిళలు

వరుణదేవా కరుణించవా!

- మల్కారం గ్రామంలో కప్పకావిడి

వరుణ దేవా కరుణించవా.. అంటూ ఆదివారం పలువురు మహిళలు కప్పకావిడి నిర్వహించారు. చాలా రోజులుగా వానలు కురువకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో మహిళలు కప్పకావిడితో ఊరేగింపు నిర్వహించారు. ఇప్పటికైనా వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు నీలమ్మ, భారతమ్మ, జంగమ్మ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

-శంషాబాద్ రూరల్, ఆగస్టు 18



హైదరాబాద్ - బెంగుళూరు రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ టెర్రర్!

- 44 ఎన్‌హెచ్‌పై నిత్యం ట్రాఫిక్ జామ్
- కిలోమీటర్ల మేర నిలుస్తున్న వాహనాలు
- గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు
- అండర్‌పాస్, జంక్షన్ల మూసివేతే కారణమంటున్న స్థానికులు

కొత్తూర్, ఆగస్టు 18: తరుచూ ట్రాఫిక్ జామ్‌తో 44వ జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కనీసం అంబులెన్స్‌కు సైతం దారి దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. కొత్తూర్ వై జంక్షన్, అండర్‌పాస్, జేపీ దర్గా జంక్షన్లను వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. దీంతో దూరంగా వెళ్లి యూటర్న్ తీసుకుంటుండడంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ స్తంభిస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ - కొత్తూర్ రోడ్డుపై నిత్యం ఇదే పరిస్థితి.



బారికేడ్లతో మూసివేసిన కొత్తూర్ అండర్‌పాస్

దారి మళ్లించడంతోనే..

కొత్తూర్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి వై జంక్షన్ నుంచి జ్యోతిరావు పూలే విగ్రహ చౌరస్తా వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులకు ఆటంకం కలుగకుండా ఉండేలా ట్రాఫిక్ పోలీసులు పలు జంక్షన్లను మూసివేశారు. వైజంక్షన్, అండర్‌పాస్, జేపీ దర్గా జంక్షన్‌లను పూర్తిగా మూసి వేయడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. దాంతో హైదరాబాద్ నుంచి కొత్తూర్ మీదుగా షాద్‌నగర్ వైపు వచ్చే వాహనాలతో పాటు జేపీ దర్గాకు వెళ్లే వాహనాలను బైపాస్ రోడ్డుకు మళ్లించారు. దాంతో కొత్తూర్‌కు వచ్చే వారు కాలినడకన ఊరులోకి రావాల్సి వస్తోంది.

అండర్‌పాస్‌ను వెంటనే పునరుద్ధరించాలి



వైజంక్షన్‌తో పాటు అండర్‌పాస్‌ను మూసివేయడంతోనే ట్రాఫిక్ తిప్పలు. నిత్యం వాహనాలు స్తంభిస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులతో జంక్షన్లను మూసివేయడం సరికాదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే అండర్‌పాస్‌ను పునరుద్ధరించాలి.

-మాదారం నర్సింహగౌడ్, కౌన్సిలర్, కొత్తూర్

ఆలస్యంగా గమ్యస్థానాలకు


ప్రధానంగా కొత్తూర్ పారిశ్రామిక ప్రాంతం, తిమ్మాపూర్ వద్ద ఐవోసీఎల్ బాట్లింగ్ యూనిట్ ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. ఈ జంక్షన్ల మూసివేతతో వాహనాలు తిమ్మాపూర్, పెంజర్ల జంక్షన్ల వద్ద యూటర్న్ తీసుకుని వారి గమ్యస్థానాలకు వెళ్లాల్సి ఉంది. వాహనాలు యూటర్న్ తీసుకునే సమయంలో 44వ జాతీయ రహదారి గుండా వచ్చే వాహనాలకు అడ్డంకి ఏర్పడుతోంది. దాంతో హైదరాబాద్ - బెంగుళూరు రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆస్పత్రులకు వెళ్లే వారికి సైతం నరకయాతన తప్పడం లేదు. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, ప్రజలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి సమయానికి గమ్యస్థానాలకు చేరలేకపోతున్నారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.


ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి



ప్రతీరోజు ట్రాఫిక్ జామ్‌తో ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం కలగకుండా, అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-కె. శివాచారి, కొత్తూర్








హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

చౌదరిగూడ, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంట వాసులు అన్నారు. ఆదివారం తండాలో యువకులు, నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి ఆకాశ్ మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న డాక్టర్‌పై లైంగిక దాడి చేసి చివరకు ప్రాణాలు బలిగొన్న నిందితులను వెంటనే గుర్తించి ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఠల్‌నాయక్, రామ్‌చరణ్, సునిల్‌రెడ్డి, రవినాయక్, రాహుల్, అజయ్‌నాయక్, అనిల్‌నాయక్, శంకర్‌నాయక్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.





బురదలో కూరుకుపోయిన లారీ



అంతారం తండా సమీపంలో
బురదలో కూరుకుపోయిన లారీ

తాండూరు రూరల్, ఆగస్టు 18: ఇటీవల కురిసిన వర్షాలకు తాండూరు మండలం అంతారం తండా సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు బురదమయంగా మారింది. ఈ విషయం తెలియని హెవీ లారీ డ్రైవర్లు రోడ్లపై లారీలు నడపటంతో బురదలో ఇరుక్కుపోయారు. దీంతో 3-4 లారీల వరకు ఆదివారం ఇరుక్కుపోయాయి. అయితే హైదరాబాద్ నుంచి కరన్‌కోట్ వెళ్లేందుకు కొంత మంది లారీ డ్రైవర్లు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి షార్ట్‌కట్‌లో వెళ్లేందుకు లారీలను నడుపుతుంటారు. ఇందులో భాగంగా అధిక వర్షం కురియడంతో రోడ్డంతా బురదమయంగా మారి లోడ్ లారీలన్నీ ఇరుక్కుపోయినట్లు అంతారం తండాకు చెందిన రామునాయక్ తెలిపారు. వారం రోజుల క్రితం బురదమయంగా ఉన్నప్పటికీ కొంత దూరం వరకు భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ జేసీబీ యంత్రంతో నాపరాతి ముక్కలు వేయించి చదును చేయించారు. అయినప్పటికీ శనివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రోడ్డంతా బురదమయం కావడంతో లారీలు ఇరుక్కుపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక శాసన సభ్యులు మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు రామునాయక్ తెలిపారు.

సయ్యద్‌పల్లిలో రైతుల సంబురాలు



సయ్యద్‌పల్లి గ్రామంలో స్వీట్లు తినిపించుకుంటున్న రైతులు

పరిగి, ఆగస్టు 18: రైతులకు రూ2 లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా ఆదివారం పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామంలో సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి ఆధ్వర్యంలో సయ్యద్‌పల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం రైతులతో స్వీట్లు తినిపించుకుని సంబురాలు జరుపుకున్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేశ్, నాయకులు నర్సిరెడ్డి, అన్వర్, తలారి రాములు, వెంకటయ్య, రమేశ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దు

కొడంగల్, ఆగస్టు 18: ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. కొడంగల్‌లో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్వచ్ఛంద సంస్థకు అప్పగించడంతో కార్మికులు జీవనోపాధిని కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఏళ్లుగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా కొనసాగుతున్న వారిని అన్యాయం చేయరాదన్నారు.









ఉత్సాహంగా పౌరాణిక నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో కుచేలుడు, సత్యభామ, శ్రీకృష్ణుడు పాత్రధారులు

శంకర్‌పల్లి, ఆగస్టు 18: మండలంలోని జన్వాడలో శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, మయసభ, ఏకపాత్రాభినయం పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. శనివారం రాత్రి పద్మారవీందర్‌గౌడ్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన శ్రీకృష్ణాంజనేయ యుద్ధం నాటకం చూపరులను అలరించింది. జన్వాడ, మీర్జాగూడ గ్రామస్తులు నాటకాన్ని తిలకించారు. నరహరిరాజు సంగీత దర్శకత్వంలో జనతా సేవాసమితి మహబూబ్‌నగర్ కళాకారులు నాటక ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణుడిగా దుర్వాసరాజు, ఆంజనేయుడుగా ఎం.సంజీవయాదవ్, నారదుడిగా ఎం.తిరుపతయ్య, సత్యభామగా ఎం.రాధిక, రుక్మిణిగా రాజేశ్వరి, బలరాముడిగా హన్మంతు, గరుత్మంతుడిగా శంకర్, కుచేలుడి పాత్రధారుడి రాములు నాటకాలను రక్తి కట్టించారు. కళాకారుల నటన అలరించింది. నాటక ప్రదర్శనకు శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్, మీర్జాగూడ నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, నాగేందర్, మల్లేషం, గౌడిచర్ల వెంకటేష్ హాజరయ్యారు.

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుందాం



బోనాల వేడుకలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, ఆగస్టు 18 : పండుగలు, వేడుకలు, గ్రామీణ సంప్రదాయాలు వంటి సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల పరిధి బొంగులూరు గంగానగర్ కాలనీలో ఆదివారం అమ్మవారి బోనాలు నిర్వహించారు. మహిళలు ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. చైర్మన్, కౌన్సిలర్ మౌనిక, కనకదుర్గ ఆలయ చైర్మన్ అరుణనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, ఉదయ్‌పాల్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా ఔషధ గుణాలు కలిగిన పసుపు, కుంకుమ, మామిడి, వేప తదితర వస్తువులను వినియోగిస్తూ జరుపుకునే పండుగ బోనాలు అని అన్నారు. ఇది మనకు పూర్వీకులు అందించిన గొప్ప వారసత్వమని చైర్మన్ అన్నారు. ప్రజలు సామూహికంగా జరుపుకునే పండుగలను భావితరాలకు అందించాలని కోరారు.

అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ



ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన రైతులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18: అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ వస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయానికి ఆదివారం కొందుర్గు మండల రైతులు వచ్చి ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మూడు విడతల్లో రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలుపుకున్నారన్నారు. సాంకేతిక కారణాలతో కొందరికి ఇప్పుడు రాకున్నా త్వరలోనే వారికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. షాద్‌నగర్‌లోని బరోడా బ్యాంక్ బ్రాంచిలో సాంకేతిక లోపంతో మొదటి విడతలో 500మందికి రుణమాఫీ రాలేదని తెలిసిన వెంటనే బ్యాంకర్లతో మాట్లాడి సమస్యను ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి, రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకుపోయి రుణమాఫీ చేయించామని తెలిపారు. ఇప్పుడు కూడా రుణమాఫీ రాని రైతులు వ్యవసాయశాఖ ఆఫీసులో దరఖాస్తు చేసుకుంటే, నెలరోజుల్లో అర్హతున్న వారందరికీ రుణమాఫీ వస్తుందని తెలిపారు. పదేళ్లలో రుణమాఫీ చేయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోని బావబామ్మర్దులు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే రైతులు ఊరుకోరు అని హెచ్చరించారు. ప్రజాహితానికి పాటుపడుతున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం కేటీఆర్, హరీష్‌రావులు మానుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వై.యాదయ్యయాదవ్, చెన్నయ్య, శివశంకర్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే కుట్ర రాజకీయాలు



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 18 : రుణమాఫీతో రైతులు ఆనందపడుతుంటే జీర్ణించుకోలేని విపక్షాలు విషప్రచారాలకు ఒడిగట్టాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కడ్తాలలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. రుణమాఫీపై అపోహలు, అనుమానాలకు తావులేదన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో ఎవరైనా రైతులకు రుణమాఫీ కాకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో తిరిగి రికార్డు చేసుకొని అర్హులకు రుణమాఫీని తప్పక వర్తింపజేస్తారన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతుల్లో ఆనందాన్ని చూడడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయం అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు శంకర్, భానుకిరణ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

బషీరాబాద్‌లో అసంపూర్తిగా భోజనశాల



బషీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా భోజనశాల భవనం

బషీరాబాద్, ఆగస్టు 18: బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) ఆవరణలో చేపట్టిన భోజనశాల భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మనఊరు-మనబడి కింద ఏడాదిన్నర కిందట ఈ భోజనశాల భవనం మంజూరు కాగా పిల్లర్లు వేసి, పైకప్పు రేకులు బిగించారు. అనంతరం ఎడెనిమిది నెలలు గడిచాక ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. ఇక్కడి పాత భవనంలో వండి పెట్టగా చెట్లకింద కూర్చుని విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చేసిన పనికి సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోతున్నానని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ విషయమై ఏఈ లక్ష్మణ్‌ను వివరణ కోరగా నిధులు లేక బిల్లులు అందలేదనే విషయం వాస్తవమేనన్నారు. ఈక్రమంలో పలు పాఠశాలల్లో భోజనశాల పనులు పూర్తికాలేక అసంపూర్తిగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రేమానురాగాల రక్షాబంధన్

- అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ఆప్యాయతకు ప్రతీక
- నేడు రాఖీపౌర్ణమి వేడుక
- పుట్టిళ్లకు చేరుకుంటున్న ఆడపడచులు



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు



ఆకర్షణీయంగా రాఖీలు

ఆమనగల్లు, ఆగస్టు 18: అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల్ల అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి. 'నేను నీకు రక్ష. నువ్వు నాకు రక్ష.' తోబుట్టువుల బాంధవ్యంతో పాటు దేశభక్తి పెపొందించే పండుగ రక్షాబంధన్. తోబుట్టువుల అనుబంధానికి గుర్తుగా హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీపౌర్ణమి ప్రత్యేకమైనది. సోమవారం(నేడు) రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కడుతారు. పెళ్లయిన ఆడపడచులు పుట్టిళ్లకు చేరుకుంటున్నారు. భారతీయ సంస్కృతిలో రక్షాబంధన్‌కు ఎంతో ప్రాధాన్యం వుంది. రాఖీ అనేది రంగుల దారమే కాదు. సోదరుల జీవితాలను రంగులమయం చేయాలని ఆకాంక్షిస్తూ అక్కాచెల్లెల్లు కట్టేది రాఖీ. తోబుట్టువుల కష్టసుఖాల్లో ఆత్మీయ బంధాన్ని, మమతానురాగాలను గుర్తుచేసేది రక్షాబంధన్. యేటా కొన్ని వర్గాల వారు సంప్రదాయం ప్రకారం గాయత్రీ స్వరూపంగా భావించే జంధ్యాన్ని రాఖీ పౌర్ణమి రోజున ధరిస్తారు. యేటా శ్రావణ పౌర్ణమి రోజున రక్షాబంధన్ జరుపుకుంటారు.

కులమతాలకు అతీతంగా

రక్షాబంధనానికి చారిత్రక వైశిష్ట్యం ఉంది. సోదరభావంతో మెలిగేవారందరికీ మహిళలు రాఖీ పౌర్ణమి నాడు రాఖీలు కడతారు. చీలుతున్న సమాజాన్ని ఒక్కటి చేసేలా, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పాదుకొల్పేది రక్షాబంధన్ అనడంలో సందేహం లేదు. కుల, మతాలకు అతీతంగా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. మానవ, కుటుంబ సంబంధాలు పడిపోతూ ఆర్థిక సంబంధాలే ఎక్కువవుతున్న ఈ రోజుల్లో అనుబంధం, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచేది రాఖీ పౌర్ణమి అనడంలో సందేహం లేదు. అక్కాతుమ్మళ్లు, అన్నాచెల్లెళ్లకు రాఖీపౌర్ణమి ఒక తీపిగుర్తు. సోదరులు ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా వారు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ ఆడపడచులు రాఖీ కడతారు.

ఆధునిక డిజైన్లలో రాఖీలు

కాలానికనుగుణంగా రాఖీల రూపురేఖల్లోనూ కొత్త పోకడలు సంతరించుకున్నాయి. యేటా రకరకాల రాఖీలు వస్తున్నాయి. ఆమనగల్లులోని రహదారులపై ఎక్కడ చూసినా రాఖీల విక్రయ దుకాణాలు వెలిశాయి. శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పక్కన, ఆమనగల్లు-మాడ్గుల, ఆమనగల్లు-తలకొండపల్లి రోడ్ల వెంట రాఖీల స్టాళ్లను ఏర్పాటు చేశారు. వ్యాపారులు హైద్రాబాద్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి రాఖీలను తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. నాలుగైదు రోజుల పాటు మార్కెట్‌లో రాఖీల సందడి నెలకొంది.

పెరిగిన ధరలు

రాఖీ డిజైన్, రకం, సైజులను బట్టి రూ.30 నుంచి రూ.500 ధర ఉన్నారు. వెండి రాఖీలనూ విక్రయిస్తున్నారు. రాఖీల కొనేందుకు వస్తున్న ఆడపడచులతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. ఈ యేడాది రాఖీల ధరలు పెరిగాయి. గతం కంటే 15 నుంచి 30శాతం వరకు ధరలు పెంచేశారు.



పోచమ్మ ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వైభవోపేతంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే
- వేలాదిగా తరలొచ్చిన భక్తులు



పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఆగస్టు 18: కొత్తూర్‌లో గ్రామ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ నెల 16న ప్రారంభమైన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రూ.2కోట్లతో దాతల సహకారంతో మున్సిపాలిటీలో మూడు పోచమ్మ, నాలుగు మైసమ్మ ఆలయాలు, ఎల్లమ్మ ఆలయం, ఇతర దేవతామూర్తుల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. ప్రాతఃకాల పూజ, గురు ప్రార్థనం, రత్నంన్యాసం, ధాతున్యాసం, ఉత్తరాషాఢ నక్షత్రాన పోచమ్మ, మైసమ్మ, పరివార దేవతలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. హోమం, అమ్మవారి దర్శనం, కుంబాభిషేకం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సత్తెనపల్లి శ్రీ శక్తి దుర్గాపీఠాదిపతి అనుమతిస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పూర్తిచేశారు. కొత్తూర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే.అరుణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ దేవలతను దర్శించుకొని పూజలుచేశారు. వారు మాట్లాడుతూ గ్రామ దేవతల పునఃప్రతిష్ఠ కార్యక్రమం చేయడం శుభసూచకం అని, ప్రజలకు సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. ముఖ్య అతిథులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్ని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

కందుకూరులో ఘనంగా బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేఎల్లార్

కందుకూర్, ఆగస్టు 18: కందుకూరులో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆడపడచులు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాల్లో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బొక్క జంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, శమంతకమణి, మల్లేశ్, జగన్, ప్రశాంత్ చారి, జగన్, భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన ఎమ్మార్పీస్ నాయకులు



మంద కృష్ణతో స్థానిక నాయకులు

శంకర్‌పల్లి, ఆగస్టు 18: ఎమ్మార్పీస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మంద కృష్ణ కృషి ఫలితంగానే ఎమ్మార్పీస్ ఉద్యమం 30ఏళ్లు కొనసాగిందన్నారు. మాదిగ, 57 ఉపకులాలకు ఎస్సీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయొచ్చని ఆగస్టు 1న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పునివ్వడం సంతోషకరం అన్నారు. కోర్టు తీర్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణను కలిసిన వారిలో రవికుమార్, పరశురామ్ తదితరులు ఉన్నారు.

20నుంచి శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

కొడంగల్, ఆగస్టు 18: ఈ నెల 20 నుంచి కొడంగల్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆరాధానోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ సేవా సమితి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న సుప్రభాతంతో ప్రారంభమయ్యే పూజల్లో భాగంగా పంచామృతభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసి అర్చన, మంగళహారతి, బజనలు, పల్లకీ సేవ, అష్టావధానము, 21న రథోత్సవం, భజనలు, 22న భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీ ఎదుటే అక్రమ వెంచర్

- రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా!
- పత్తాలేని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు



తాండూరులోని లారీ పార్కింగ్ సమీపంలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్, రోడ్డు

తాండూరు, ఆగస్టు 18: తాండూరు నడిబొడ్డున మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికార యంత్రాంగం రోజూ ఆ వెంచర్ పక్క నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ అనుమతులు లేకుండానే రోడ్లు వేస్తున్న ఈ అధికారులకు అక్రమ వెంచర్ కనపడటం లేదా? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సర్వే నం.129, 130లలో ఎలాంటి అనుమతులు లేకుండా వారం రోజులుగా అక్రమ లేఅవుట్ చేసి ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇందులో సర్వే నం.130 ప్రభుత్వ భూమి. రూ.25కోట్ల విలువైన ప్రభుత్వ భూమికే ఎసరు పెట్టారు. గతంలో ఈభూమిపై ఫిర్యాదులు రాగా ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయరాదని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. అయినప్పటికీ అప్పటి తహసీల్దార్ నిర్లక్ష్యం వల్లే ఈ భూమి అక్రమణకు గురైందనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత యజమాని గానీ డెవలపర్ గానీ లేవుట్‌ను అభివృద్ధి చేయాలనుకుంటే ఆన్‌లైన్‌లో అనుమతులు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు మున్సిపాలిటీకి డెవలప్‌మెంట్ చార్జీలు, ఇతర అనుమతుల ఫీజులు స్పెయర్ ఫీటు చొప్పున చెల్లించాలి. మున్సిపాలిటీకి లేవుట్‌లో పార్కు లేదా ప్రభుత్వ భవనాల నిమిత్తం కొంత భూమిని (మార్టిగేజ్) కేటాయించి మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయించాలి. ఇవన్నీ లేవని తెలిసీ మున్సిపల్ టౌన్‌ప్లాన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే 13 ప్లాట్లు చేసి విక్రయించినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



అక్రమ వెంచర్ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయంపై వికారాబాద్ కలెక్టర్‌కు, మున్సిపల్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. సర్వే నం. 129 పట్టాభూమిని ఆనుకొని పక్కనే ఉన్న సర్వే నెం.130లోని ప్రభుత్వ భూమిని అక్రమించుకొని ప్లాట్లు చేయడాన్ని ఆపివేయాలి. మున్సిపాలిటీ అధికారులు అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి.

- సూరజ్ సింగ్ ఠాకూర్, మాజీ కౌన్సిలర్, తాండూరు

ఉద్యోగం నుంచి తొలగించారని ధర్నా



సోలార్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న దారులపల్లి గ్రామస్థులు

మర్పల్లి, ఆగస్టు 18: పది సంవత్సరాల పాటు ఉద్యోగం చేయించుకొని చెప్పకుండా ఉద్యోగం నుంచి తొలగించారని ఓ వ్యక్తి తన కుటుంబసభ్యులు, గ్రామస్తులతో కలిసి దారులపల్లి సోలార్ ప్లాంట్ ముందు ధర్నాకు దిగాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దారులపల్లి గ్రామానికి చెందిన ఫయోద్దీన్ సోలార్ ప్లాంట్‌లో గత 10 సంవత్సరాలుగా ఏఎస్‌వో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మూడు నెలల కిందట ఉద్యోగం నుంచి తొలగించామని, ఇక నుంచి రావొద్దని చెప్పడంతో ఆవేదనకు గురయ్యాడు. పదేళ్లుగా పని చేస్తున్నాను హఠత్తుగా తొలగించడం సరైంది కాదని ప్రాధేయపడినా కనికరించలేదు. సోలార్ ప్లాంట్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లను ప్రశ్నించగా రేపు, మాపంటూ మూడు నెలలుగా కాలయాపన చేయడంతో బాధితుడు కుటుంబసభ్యులు, గ్రామస్తులతో కలిసి సోలార్‌ప్లాంట్ ఎదుట గేటుకు తాళం వేసి ధర్నాకు దిగాడు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని సముదాయించి న్యాయం జరిగేలా చూస్తామని శాంతించారు.



ఘట్‌కేసర్‌లో పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



ఘట్‌కేసర్‌లో అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావణి జంగయ్యయాదవ్

వైభవంగా బోనాల వేడుకలు

ఘట్‌కేసర్, ఆగస్టు 18: ఘట్‌కేసర్‌లో ఆదివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపాలటీ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి భారీ ఏర్పాటు చేసారు. గ్రామదేవతలైన పోచమ్మ, మహంకాళి, మైసమ్మ, ఈదమ్మ, అమ్మవార్ల ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బోనాల పండుగ సందర్భంగా ఉదయం నుండే అమ్మవార్లను జనాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్‌చైర్మన్ పల్లల మాధవరెడ్డి, నాయకులు ముత్యాలుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడీమైసమ్మ బోనాలు

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణంలోని గడీ మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో ఉన్న అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున విచ్చేసి దర్శించుకున్నారు. మహిళలు బోనాలు సమర్పించుకోగా యువకులు పలారం బండ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేశారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బెవరేజేస్ సభ్యుడు నవీన్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ కొడె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం


ఆమనగల్లులో పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, చుక్క అల్లాజీగౌడ్ తదితరులు

రాచరిక దోపిడీకి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం సర్వాయి పానన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పాపన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు.


చేవెళ్లలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు


షాద్‌నగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్, సంఘాల నాయకులు



మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గౌడ కులస్తులు


మాడ్గులలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గౌడ కులస్తులు

తలకొండపల్లిలో పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ వెంకటేశ్, నాయకులు



మొయినాబాద్‌లో సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళ్లర్పిస్తున్న నాయకులు


మొయినాబాద్ రూరల్: బాకారం జాగీర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వెంకటేష్‌గౌడ్ తదితరులు


షాద్‌నగర్‌లో విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు


కందుకూరులో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయులు


షాబాద్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నాయకుల నివాళులు


కడ్తాల్: చరికొండలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సంఘాల నాయకులు


ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై సర్దార్ సర్వాయి పానన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఎడ్మ కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం



ఆమనగల్లులో ఎడ్మ కిష్టారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న పత్యనాయక్, బాలస్వామి తదితరులు

ఆమనగల్లు, ఆగస్టు 18: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, దివంగత ఎడ్మ కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్, సీనియర్ నాయకుడు గుత్తి బాలస్వామి అన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధికి కిష్టారెడ్డి జీవితాంతం తపించారన్నారు. ఆమనగల్లులో ఆదివారం ఎడ్మ కిష్టారెడ్డి 4వ వర్ధంతిని నిర్వహించారు. కిష్టారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విలువల, నిస్వార్థ రాజకీయాలకు కిష్టారెడ్డి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, రాము, ఉప్పల రాములు, చందూనాయక్, సాయిలు, డి.వెంకటేశ్, పూసల భాస్కర్, శివకుమార్, యాదయ్య, ఆనంద్, దేవేందర్,రంజిత్, మహేశ్, అల్లాజి, గిరి పాల్గొన్నారు.

కడ్తాల్: కడ్తాలలో మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించి న కార్యక్రమంలో ప్రజాప్రతినిధు లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటాని కి నివాళులర్పించారు. ఎడ్మ సేవలను నాయకులు కొనియాడా రు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు రాజుగౌడ్, వెంకటేశ్, రమేశ్, లాయక్ అలీ, బిక్షపతి, రాంచంద్రయ్య, ఇమ్రాన్‌బాబ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి


విజేతలకు బెల్టులను ప్రదానం చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18: కుంగ్ ఫూ, కరాటే లాంటి యుద్ధ విద్యల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్ కోరారు. షాద్‌నగర్ న్యూ మాంక్స్ కుంగ్-ఫూ ఆధ్వర్యంలో ఆదివారం పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో కుంగ్-ఫూలో పోటీలు నిర్వహించి, విజేతలకు బెల్టులను ప్రదానం చేశారు. చిన్నారుల్లో శరీర దారుఢ్యం, ఆత్మస్థైర్యం కోసం యుద్ధవిద్యలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధచూపాలని, ప్రతి విద్యార్థికి ట్రాఫిక్ రూల్స్‌ను నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కూంగ్-ఫూ మాస్టర్లు బాల్‌రాజ్, జి.రమేష్, నరేష్, ఫరూక్‌ఖాన్, లక్ష్మణ్‌కుమార్, కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, రంగంపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కేశంపేట, ఆగస్టు 18: జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటలన వివరాలు ఇలా ఉన్నాయి. జీవితంపై విరక్తితో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వేముల్‌నర్వలో చోటుచేసుకుంది. కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డోల రాములు(54) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మద్యానికి బానిసైన రాములు ఉరేసుకుంటా అని కుటుంబీకులతో అంటుండేవాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఆదివారం రాములు అల్లుడు నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక, కుటుంబ సమస్యలతో యువకుడు...

ఆదిభట్ల: ఆర్థిక, కుటుంబ సమస్యలతో ఆదివారం ఆదిభట్ల పరిధి తుర్కయంజాల్‌లో ఓ యువకుడు ఉరేసుకున్నాడు. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎం.వంశీకృష్ణ(26) తల్లిదండ్రులు లేకపోవడంతో సోదరి భావనతో కలిసి తుర్కయంజాల్ ఏపీ నగర్‌లోని సొంత ఇంట్లో ఉంటూ డీటీడీసీలో కొరియర్ బాయ్‌గా పనిచేసేవాడు. శనివారం రాత్రి 11గంటలకు ఇంటికొచ్చి స్నానం చేసొస్తానని అక్కతో చెప్పి మేడపైకి వెళ్లాడు. వచ్చి భోజనం చేసి పడుకుండాడని అక్క అనుకొని నిద్రపోయింది. మేడపైకి వెళ్లిన వంశీకృష్ణ రేకుల రూమ్‌లో చున్నీతో ఉరేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం కిరాయికి ఉండే వ్యక్తి లక్ష్మణ్ చూసి భావనకు చెప్పాడు. ఆర్థిక, కుటుంబ సమస్యలతో తన తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒంటరి జీవితాన్ని భరించలేక మరో యువకుడు ...

ఆదిభట్ల: తల్లిదండ్రుల మృతితో ఒంటరి జీవితం, అనారోగ్య సమస్యలతో క్షోభకు గురైన ఓ యువకుడు విషంతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుర్మల్‌గూడ ఇందిరమ్మ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హర్షవర్ధన్(24) అనే యువకుడు బాలాపూర్ మండలం కుర్మల్‌గూడ ఇందిరమ్మ కాలనీలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం 4:15గంటలకు కుర్మల్‌గూడలోనే ఉండే తన మేనమామ మన్నెపల్లి అనిల్‌కు ఫోన్‌చేసి తాను మాత్రలు వేసుకున్నానని చెప్పి ఫోన్ కట్‌చేశాడు. అనిల్ వెంటనే తన కొడుకుతో హర్షవర్ధన్ రూమ్‌కు చేరుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న హర్షవర్ధన్‌ను బాలాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి చేర్పించాడు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం హర్షవర్ధన్ మృతిచెందాడు. అతడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. అతడు వెన్నునొప్పితో బాధపడేవాడు. శనివారమే హర్షవర్ధన్ పుట్టినరోజు కావడం, తల్లిదండ్రులను గుర్తుచేసుకొని మానసిక క్షోభతో ఆత్మహత్య చేసుకున్నాడని అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న బైక్.. దంపతులకు గాయాలు


గాయపడిన అనూష

కేశంపేట, ఆగస్టు 18: రోడ్డుపై నిలిపి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో దంపతులు గాయపడ్డారు. పుట్టోనిగూడకు చెందిన పెద్దిన ఆంజనేయులు, అనూష దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి అనూష అస్వస్థతకు గురైంది. దీంతో ఆంజనేయులు ఆమెను బైక్‌పై షాద్‌నగర్‌కు తీసుకెళ్తుండగా సంగెం శివారులో ఆగిఉన్న టిప్పర్‌ను వెనుకల నుంచి ఢీకొట్టాడు. దీంతో భార్య భర్తలు గాయపడ్డారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆదివారం ఉస్మానియాకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న సబితారెడ్డి

కందుకూర్, ఆగస్టు 18: బీఆర్ఎస్ కందుకూరు మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి దీక్షిత్‌రెడ్డి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ పెళ్లికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆడబిడ్డల పెళ్లికి పుస్తెమట్టెల బహూకరణ



కేశంపేట, ఆగస్టు 18: పేదింటి ఆడబిడ్డల పెళ్లిలకు పుస్తె, మట్టెలిచ్చి తన ఉదాతర చాటుకున్నారు పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి. గ్రామానికి చెందిన అబ్బి-లక్ష్మమ్మ దంపతుల కూతురు శాలిని, రాంచంద్రయ్య-రాణి దంపతుల కూతురు శిరీష వివాహం ఆదివారం నిశ్చయించారు. పెళ్లికి ముందు ఈ రెండు కుటుంబాలకు మాజీ సర్పంచ్ తన తల్లి విజయమ్మ చేతుల మీదుగా పుస్తెమట్టెలు అందిజేశారు. నాలుగేళ్లుగా ఆడబిడ్డల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలు అందిస్తున్నట్టు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

సంకెపల్లిగూడలో మల్లన్న కల్యాణోత్సవం


మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

షాబాద్, ఆగస్టు 18 : మండల పరిధి సంకెపల్లిగూడలో మల్లన్న కల్యాణోత్సవం, బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో బోనాలు ఊరేగింపు ఆలయం వదరకు సాగింది. గ్రామస్థులు మల్లన్నస్వామికి బోనాల నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ కాన్స్‌ట్యెన్సీ ఇన్‌చార్జి భీం భరత్, పీసీసీ ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులుచెన్నయ్య, దర్శన్, రాజేందర్, రాజేందర్‌రెడ్డి, సాయికృష్ణారెడ్డి, అంజిరెడ్డి, నవీన్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

భూ వ్యవహారంలో పోలీసులకు ఫిర్యాదు

చౌదరిగూడ, ఆగస్టు 18: తన తల్లి పేరిట ఉన్న భూమిలో కొందరు గ్రామస్తులు కలుగజేసుకొని వర్గ వైశమ్యాలను సృష్టించే కుట్ర చేస్తున్నారని పెద్ద ఎల్కిచర్లకి చెందిన మహ్మద్ ఆసీఫ్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల పరిధి వీరన్నపేటలో సర్వేనంబరు 38లో నాలుగు ఎకరాల 11గుంటల భూమి తన తల్లి జహేదాబేగం ఉందని తెలిపారు. ఈ భూమిలోకి గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా చొరబడి భయభ్రాంతులకు గురుఇచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మతకలహాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరాడు.

కోదండరాంను కలిసిన ఉద్యమకారులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18: శాసన మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాంను ఇబ్రహీంపట్నంకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం నగరంలో ఆయన నివాసంలో కలిసి జ్ఞాపికను అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక వహించిన కోదండరాంకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సముచిత గౌరవం ఇచ్చిందని, ముున్ముందు ఉన్నత పదవుల్లో చూడాలని ఉందన్నారు. ఈ ప్రభుత్వం తెలంగాణ ఉద్యంకారులను గుర్తించి తగిన గౌరవం ఇస్తుందని ఆశిస్తున్నామని ఉద్యమకారులు అన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉద్యమకారులు లాలగారి జంగయ్య, పి.రవీందర్‌గుప్తా, ఎండీ గౌస్, అంజయ్య ముజీద్, రమేష్, నిరంజన్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్సీ కోదండరాంకు జ్ఞాపికను అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నెపు ప్రభు


అన్నెపు ప్రభును సత్కరిస్తున్న పానుగంటి పర్వతాలు

శంషాబాద్, ఆగస్టు 18 : ఏటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంషాబాద్‌కు చెందిన అన్నెపు ప్రభు ఎన్నికయ్యారు. భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఆదివారం రాజేంద్రనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రభు ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు పేర్కొన్నారు. ప్రభును శంషాబాద్‌లోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పర్వతాలు, ఇతర నాయకులు శాలువాతో సత్కరించారు.

మహిళలతో కిక్కిరిసిన రాఖీ దుకాణాలు

చేవెళ్ల, ఆగస్టు 18:రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని చేవెళ్లలో రాఖీ దుకాణాలు మహిళలతో కిక్కిరిశాయి. ఆదివారం చేవెళ్లలో రాఖీ దుకాణల వద్ద మహిళల సందడి కన్పించింది. గతేడాది కంటే ఈ ఏడాది రాఖీల ధరలు పెరిగాయని పలువురు మహిళలు అన్నారు. రాఖీ పండుగ అక్కా తమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని, ఎంత ధర ఉన్నా రాఖీలు కొని కడతామని మహిళలు, యువతులు అన్నారు. తోడబుట్టినవారి ఆప్యాయతకు ఏదీ సాటి రాదన్నారు.


చేవెళ్లలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కొత్తూర్ గ్రామ భీమ్‌సేన్ యువజన సంఘం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

కందుకూర్, ఆగస్టు 18 : కందుకూరు మండలం కొత్తూరు గ్రామంలో బీమ్‌సేన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ బీమ్‌సేన్ యువజన సంఘం అధ్యక్షుడిగా లకుమల్ల ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు ఆనంద్, దినేష్, ప్రధాన కార్యదర్శిగా ఎ.మహేశ్, కోశాధికారులుగా ఎల్.శేఖర్, యాదగిరి ఎన్నికయ్యారు. వీరితో పాటు పలువురు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణ, బండి నర్సింహ, పి.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చేవెళ్ల, ఆగస్టు 18: చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించిన వినికిడి లోపం నిర్ధారణ వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని ప్రముఖ ఆడియాలజిస్ట్ డాక్టర్ ఎం.కృష్ణయ్య, డాక్టర్ గోపాల్‌లు తెలిపారు. ఆదివారం చేవెళ్లలోని శ్రీ సత్యసాయి ఆసుపత్రిలో ఉచిత మెగా వినికిడి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుప్రతికి వచ్చిన రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. చికిత్సకు వచ్చిన 20మందిలో వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి పరికరాల కోసం ఆర్డర్ చేశామన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు లక్ష విలువగల శస్త్ర చికిత్సలకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దలకు కూడా తాము ఉచితంగా టెస్ట్‌లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యుడు రాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.


చేవెళ్లలో ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు


రోడ్డు మరమ్మతులను ప్రారంభిస్తున్న ఆంజనేయులుగౌడ్

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 18: చిన్నమంగళారం-వీరన్నపేట గ్రామాల రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థుల ఇబ్బందులు తీర్చేందుకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు అవిశిపేట ఆంజనేయులుగౌడ్ ముందుకొచ్చాడు. తన సొంత డబ్బులు వెచ్చించి ఆదివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. గుంతలను సీసీతో పూడ్చేయించారు. గ్రామానికి సేవ చేయడం తన లక్ష్యం అని ఆంజనేయులుగౌడ్ అన్నారు.

పేద విద్యార్థికి ప్రిన్సిపాల్ ఆర్థిక చేయూత

మహేశ్వరం, ఆగస్టు 18: ఉన్నత విద్యకు పేదరికం అడ్డు కావొద్దని మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ అన్నారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తిచేసిన సిద్దు అనే విద్యార్థి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. అతడు కాలేజీలో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రిన్సిపాల్ విద్యార్థికి రూ.20వేల సాయం అందజేశారు.